రోడ్లన్నీ ఛిద్రం.. ప్రయాణం నరకప్రాయం!

వర్షాలకు గుంతలమయమైన రోడ్లు | పట్టణాలు, గ్రామాల్లో పరిస్థితి అధ్వానం | పాదచారులు, వాహనదారులకు తప్పని ఇబ్బందులు | మరమ్మతు చేయడంలో రాజ్యమేలుతున్న నిర్లక్ష్యం





జవహర్‌నగర్, పీర్జాదిగూడ, ఘట్‌కేసర్ పురపాలక సంఘాల పరిధిలో అధ్వానంగా తయారైన రోడ్లు

సాక్షి, సిటీబ్యూరో: ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ నగర శివారు పురపాలికలు, పంచాయతీల పరిధిలోని రోడ్లు గుంతలమయమై అధ్వానంగా తయారవుతున్నాయి. లోతట్టు కాలనీలు, మురికి వాడలను వరద దాదాపు ముంచెత్తుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. పలు చోట్ల డ్రైనేజీలు కాలువలు కూడా దెబ్బతిన్నాయి. రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారటంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు నడవలేని పరిస్థితులు నెలకొన్నాయనడం అతిశయోక్తికాదు.

- బోడుప్పల్, జవహర్‌నగర్, పీర్జాదిగూడ, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, పోచారం పురపాలక సంఘాల పరిధిలోని దాదాపు అన్ని రోడ్లూ గుంతలమయంగా మారాయి.
- గతంలో భారీగా పడిన వర్షాలతో బోడుప్పల్, పీర్జాదిగూడ పురపాలక సంఘాల్లోని తొమ్మిది కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయి. డ్రైనేజీ కాలువల సహా రోడ్ల పనులకు ప్రభుత్వం రూ. 110 కోట్లు విడుదల చేసినా.. పనులు పూర్తి చేయకపోవటంతో రోడ్లు ఛిద్రంగా మారి పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.
- ఉప్పల్ నుంచి వరంగల్ జాతీయ రహదారిలో ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో వరద నీరు రోడ్డుపై ఎక్కడికక్కడ నిలిచిపోగా, గంటల తరబడి ట్రాఫిక్ స్తంభిస్తోంది.
- నాగారం నుంచి కీసర ప్రధాన రోడ్డులో వరద నీరు జోరుగా ప్రవహించటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే పరిస్థితి శివారుల్లోని పలు గ్రామ పంచాయతీల్లో దర్శనమిస్తున్నాయి.

చెరువుల కబ్జాతో...

- నగర శివారు చెరువు, కుంటలు, శిఖం భూములు, నాలాల స్థలాల కబ్జాల బారినపడ్డాయి. చిన్నపాటి వర్షానికే చెరువులు కాస్తా నిండి సమీపంలోని కాలనీలు, లోతట్టు ప్రాంతాలు, రోడ్లపైకి నీరు చేరుతోంది.
- చెరువులు, నాలాల భూముల్లో అక్రమ కట్టడాలు పెరిగిపోయాయి. నాగారం, దమ్మాయిగూడ, జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, బడంగ్‌పేట్ పురపాలక సంఘాల్లో పలు కాలనీలు, చెంగిచర్లలోని బస్సు డిపో సమీపంలో ఉన్న చెరువు కట్ట ధ్వంసం చేసి బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించటం వల్ల సమీపంలోని కాలనీల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడంలేదు.

శివారు పురపాలక సంఘాల్లో..

- హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లోని బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట్, జవహర్‌నగర్, బడంగ్‌పేట్, మీర్‌పేట్, బండ్లగూడ నగర పాలక సంస్థలు ఉన్నాయి. ఇవేకాకుండా దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, కొంపల్లి, దుండిగల్, మేడ్చల్, పెద్ద అంబర్‌పేట్, తుక్కుగూడ, ఇబ్రహీంపట్నం, జల్‌పల్లి, షాద్‌నగర్, శంషాబాద్, శంకర్‌పల్లి, తుర్కయాంజాల్, మణికొండ, నార్సింగ్, ఆదిభట్ల, అమనగల్లు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆయా పట్టణాల్లో ప్రజల ముక్కు పిండి ఏటా వివిధ పన్నుల రూపేణా రూ. 343 కోట్లు వసూలు చేస్తున్నారు. అయినా ప్రజలకు మెరుగైన వసతులు, సేవలు కల్పించే విషయంలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- శివారు ప్రాంతమైన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాల నుంచి పన్నుల ద్వారా రూ. 175 కోట్లు వస్తుండగా, రంగారెడ్డి జిల్లాలో 16 పురపాలక సంఘాల నుంచి రూ. 168 కోట్లు వసూలవుతోంది.
- 15వ ఆర్థిక సంఘం ద్వారా కూడా ప్రతి నెల ఒక్కో పురపాలక సంఘానికి రూ. 3 లక్షల నుంచి రూ. 21 లక్షల నిధులు విడుదలవుతున్నాయి. పట్టణ ప్రగతితో కూడా పురపాలక సంఘాల ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఈ నిధులను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి ఉన్నా సంబంధిత యంత్రాంగం పట్టించుకోకపోవటంతో అభివృద్ధి కుంటుపడుతోందనే ఆవేదన సర్వత్రా వ్యక్తం అవుతోంది.



సీఎం సారూ.. రోడ్డు వేయరూ...

జవహర్‌నగర్: సీఎం సార్.. జర రోడ్లు వేయరా ప్లీజ్ అంటూ బురదమయంగా ఉన్న రోడ్లను చూసి చిన్నారులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. 'సీఎం రేవంత్‌రెడ్డి తాతయ్యా... మా కాలనీకి వెళ్లాలంటే భయంగా ఉంది. ఎక్కడ చూసినా బురదే. పాఠశాలలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. మాకు ఇక్కడ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఉన్నా పట్టించుకోవడంలేదు. రేవంత్ తాతయ్యా మా కాలనీకి రోడ్లు వేయండి ప్లీజ్...' అంటూ జవహర్‌నగర్‌లోని 28వ డివిజన్ లక్ష్మీనర్సింహకాలనీకి చెందిన విశ్వజిత్ తన మాటలతో సోషల్ మీడియా వేదికగా వేడుకున్నాడు. ఈ బుడ్డోడి మాటలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇకనైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందిస్తారో లేదో వేచిచూడాలి.



రోడ్లు వేయమని సీఎంను వేడుకుంటున్న చిన్నారి విశ్వజిత్

సంస్కృతీ సంప్రదాయాలకు బోనాలు ప్రతీక

దుండిగల్: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు అన్నారు. ఆదివారం దుండిగల్ గ్రామంలో బోనాలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారిని సత్కరించింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చినంగి వెంకటేశం, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్‌యాప్‌పై అవగాహన సదస్సు



సదస్సులో సూచనలిస్తున్న ఆర్టిజన్ మధు

జగద్గిరిగుట్ట: విద్యుత్ శాఖ నూతనంగా మార్పులు చేసిన టీజీఎస్పీడీసీఎల్ యాప్‌పై ఆదివారం వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ ద్వారా బిల్లుల చెల్లింపులు, ఫిర్యాదులు, వినియోగదారుల బిల్ వివరాలపై విద్యుత్ శాఖ ఆర్టిజన్ గూడెల్లి మధు వివరించారు. విద్యుత్ సిబ్బంది, అధికారుల ఫోన్ నంబర్లు కూడా అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. మైసమ్మ నగర్ బి బ్లాక్ కమిటీహాల్‌లో అవగాహన కల్పించారు.

దుండిగల్ సీఐ శంకరయ్య బదిలీ

దుండిగల్: సీఐ శంకరయ్య సైబరాబాద్ క్రైం పీఎస్‌కు బదిలీ అయ్యారు. ఇటీవల సైబరాబాద్ కమిషనర్ పలు స్టేషన్ల ఎస్‌హెచ్ఓలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా సైబరాబాద్ వీఆర్‌గా పని చేస్తున్న కనకయ్యను జీడిమెట్ల డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా, మైలార్‌దేవ్‌పల్లి డీఐగా పని చేస్తున్న గొల్ల తిమ్మప్పను బాచుపల్లి పీఎస్‌కు బదిలీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

బోనాల వేడుక ఆహ్వానం అందజేత



ఆహ్వానం అందజేస్తున్న సభ్యులు

నిజాంపేట్: ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 2, 3, రాజీవ్ గృహకల్ప వాసులు ఆదివారం నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డికి బోనాల పండుగ ఆహ్వానాన్ని అందజేశారు. ఈ నెల 28న జరిగే బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

విద్యార్థుల భవితకు పునాదులు వేయాలి



మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న వినోద్ జాదవ్



పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

రంగారెడ్డినగర్: విద్యార్థుల బంగారు భవితకు పాఠశాలల యాజమాన్యాలు పునాదులు వేసినప్పుడే ఉన్నతులుగా ఎదుగుతారని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రంగారెడ్డి నగర్‌లో బ్రైట్ ఉన్నత పాఠశాల చైర్మన్ లయన్ వినోద్ జాదవ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రైట్ ఎడ్యుకేషనల్ సొసైటీ యూరో కిడ్స్ పాఠశాలను ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ విజయ శేఖర్‌గౌడ్‌లతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఉత్తమ ఫలితాలు సాధించి ఈ ప్రాంతానికే తలమానికంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ.. పేద కుటుంబాలు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో తక్కువ ఫీజులతో మెరుగైన విద్యనందించాలని యాజమాన్యానికి సూచించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నందనం దివాకర్, జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి, ట్రస్మా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు లయన్ రామేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లయన్ బీర్రు ఆంజనేయులు, పాఠశాలల కరస్పాంటెండెంట్లు గడ్డమీది బాలరాజుగౌడ్, నరసింహులుగౌడ్, యూరో కిడ్స్ పాఠశాల ఇన్‌చార్జి వికాస్ జాదవ్, బ్రైట్ పాఠశాల ఇన్‌చార్జి అయేషా బేగం, సామాజికవేత్త కోల రవీందర్, స్థానికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: హెచ్ఎండీఏ రోడ్డు వెడల్పు పనుల సందర్భంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బాచుపల్లి సెక్షన్ ఏఈ శాంత కుమార్ ఆదివారం తెలిపారు. 11కేవీ నిజాంపేట్, ఎస్ఎంఎస్, మావిల్లాస్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిఖర విల్లాస్ నుంచి బాచుపల్లి సిగ్నల్స్ వరకు, శ్రీనివాస లేక్‌వ్యూ, బాచుపల్లి పోలీస్‌స్టేషన్ ప్రాంతం, బాచుపల్లి విలేజ్, సీతారామహోమ్స్, కౌసల్య మణిదీప్, మమత ఆసుపత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పేర్కొన్నారు.

హుండీలు అందజేత

సుభాష్‌నగర్: దూలపల్లిలోని ఎల్లమ్మ, పోచమ్మ, ముత్యాలమ్మ చిత్తారమ్మ ఆలయాలకు ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు చింతల నాగరాజుయాదవ్ ఆదివారం హుండీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మంచినీటి కోసం బోరు, పేద పిల్లల కోసం ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం

సుభాష్‌నగర్: జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులకు కౌన్సిలర్ చింతల లక్ష్మీ యాదవ్, కాంగ్రెస్ నేత భాస్కర్ ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని స్వామి వివేకానంద స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న సూరారం, దూలపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 27, 28 తేదీల్లో ఢిల్లీ, హరియాణాలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు ఆర్థికసాయాన్ని అందజేశారు.



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న భాస్కర్‌గౌడ్

డప్పుల దరువు.. శివసత్తుల పూనకాలు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అంజయ్యనగర్ రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గ అమ్మవారి బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. డప్పుల దరువు, శివసత్తుల పూనకాలతో మహిళలు బోనాలను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. ఆలయ చైర్మన్ మక్కాల సత్యనారాయణ, అధ్యక్షుడు అశోక్, ఆలయ కమిటీ సభ్యులు రమేష్, నిమ్మకాయల నర్సింగ్, మక్కాల నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా బలహీనపడ్డ బీజేపీ

సాక్షి, సిటీబ్యూరో: దేశంలో 2024వ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ బలహీన పడిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్ అన్నారు. ఆదివారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సీపీఎం విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయటానికి బీజేపీకి అవసరమైన సీట్లు రాలేదన్నారు. ఇండియా కూటమి బలపడిందని పార్లమెంటులో ఎన్డీఏ కూటమి ప్రతిపక్ష హోదా పొందిందని తెలిపారు. రైతాంగం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో బీజేపీ ఓటమిపాలైందన్నారు. ఈ ఎన్నికల్లో వామపక్షాలు స్వల్పంగా బలపడ్డాయని, సీట్ల సంఖ్య కూడా పెంచుకుందని అన్నారు. జిల్లా కార్యదర్శి సత్యం మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ 3 సీట్ల నుంచి ఎనిమిదికి పెరిగిందని చెప్పారు. మతోన్మాద బీజేపీ కూడా 4 సీట్ల నుంచి 8 సీట్లకు పెరిగిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ అర్హులైన రైతులందరికీ వర్తింప చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు కొమటి రవి, వినోద, అశోక్, కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శి, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కరాటేతో పరిపూర్ణ ఆరోగ్యం

మేడ్చల్: పిల్లలకు చిన్న వయస్సులో కరాటే వంటి విద్య నేర్పించడం వల్ల దృఢదారుఢ్యంతోపాటు మానసిక దారుఢ్యం లభిస్తుందని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని యూనివర్సల్ 369 అకాడమీలో నిర్వహించిన బెల్ట్, సర్టిఫికెట్ ప్రదానోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. పిల్లలకు విద్యతో పాటు, ఆటలు, కరాటే, కుంగ్‌ఫూ, మార్షల్‌ఆర్ట్స్ వంటి విద్యలు ఎంతో అవసరమని అన్నారు. ఆత్మరక్షణ కోసం కరాటే విద్య ఎంతో దోహదం చేస్తుందని, తల్లితండ్రులు తమ పిల్లలకు ఆత్మరక్షణ విద్యలు నేర్పించడానికి మొగ్గుచూపాలని ఆయన సూచించారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు నరేష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నరేష్‌కు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత కాంగ్రెస్ వైపు చూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పోతుల రాజేందర్, చంద్రమోహన్ సాగర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. సాయిబాబా ఆలయాల్లో జరిగిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. జీడిమెట్ల, కుత్బుల్లాపూర్, ఐడీపీఎల్, జగద్గిరిగుట్ట, సూరారం, ప్రగతినగర్, బాచుపల్లి, నిజాంపేట్, సుభాష్‌నగర్, పేట్‌బషీరాబాద్, కొంపల్లి, సుచిత్ర తదితర ప్రాంతాల్లోని సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. – కుత్బుల్లాపూర్



నిజాంపేట్ రాజీవ్‌గృహకల్ప పూజలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి



కొంపల్లి సాయికృపలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



ప్రగతినగర్ ఎన్ఆర్ఐ కాలనీలోని సాయిబాబా ఆలయంలో జరిగిన పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్



బ్యాంక్ కాలనీలో పాల్గొన్న బీజేపీ జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి



గాజులరామారం మహదేవపురంలోని సాయిబాబా ఆలయంలో జరిగిన పూజలో పాల్గొన్న కార్పొరేటర్ శేషగిరి తదితరులు

వృద్ధురాలి అదృశ్యం



సరస్వతి సాహూ

జీడిమెట్ల: మతిస్థిమితం సరిగాలేని ఓ వృద్ధురాలు అదృశ్యమైంది. ఈ ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సరస్వతి సాహూ(60) మూడు నెలల క్రితం అయోధ్యనగర్‌లో ఉంటున్న కుమారుడు విజయ్ కుమార్ సాహూ ఇంటికి వచ్చింది. ఈ నెల 17వ తేదీన ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో సరస్వతి సాహూ ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా జాడ తెలియలేదు. ఆమె కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు ఫోన్ నంబరు 9603081716కు సమాచారం ఇవ్వాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో చికిత్స పొందుతున్న వ్యక్తి పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల వివరాల ప్రకారం.. మేడ్చల్‌కు చెందిన ధనారావు ఈ నెల 20న బైక్(టీఎస్07ఈఎల్ 1901)పై మేడ్చల్ నుంచి బోరబండకు వెళ్తున్నాడు. జీడిమెట్ల గ్రామంలోని గాంధీ విగ్రహం వద్ద వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో డివైడర్‌ను ఢీకొట్టిన ధనారావుకు తీవ్రగాయాలయ్యాయి. సుచిత్రలోని వెల్‌నెస్ ఆసుపత్రికి తరలించగా..చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యేను సన్మానించిన ఆర్యవైశ్య సంఘం నేతలు

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో ధార లక్ష్మణ్, పబ్బా మల్లేష్, గంప సత్యం, రాజు, పాసుమర్తి శ్రీనివాస్, చిన్నం సత్యం, కోటేశ్వరరావు, పచ్చిపులుసు శ్రీనివాస్, జయకృష్ణ, సంపత్, శ్రీనివాస్, భాస్కర్, బ్రహ్మయ్య, గాయత్రి పాల్గొన్నారు.

మూసాపేటలో బొడ్రాయికి పూజలు



మూసాపేట: మూసాపేటలో ఆషాఢ మాస బోనాల సందర్భంగా బొడ్రాయి పూజా కార్యక్రమాన్ని రేణుకా ఎల్లమ్మ అర్చకులు ఆంజనేయశర్మ పర్యవేక్షణలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో సప్పిడి శ్రీనివాసరావు, ఆకుల రవికుమార్, నోముల శంకర్, నోముల రఘు, రామారం పార్వతమ్మ గౌడ్ పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్లపై పార్కింగ్ చేస్తే చర్యలు

కుత్బుల్లాపూర్: సర్వీస్ రోడ్లపై వాహనాల పార్కింగ్‌ను కట్టడి చేసేందుకు కఠిన చర్యలు తప్పవని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు పేర్కొన్నారు. ఈ నెల 20న పేట్‌బషీరాబాద్‌లోని సెయింట్ ఆన్స్ హైస్కూల్ రోడ్డులో ట్రాఫిక్ జామైందన్నారు. పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ వాహనాలను సర్వీసు రోడ్డుపై నిలిపారు. రోడ్డు బ్లాక్ కావడంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడ్డారని, యాజమాన్యం మీటింగ్ విషయాన్ని తమ దృష్టికి తీసుకురాలేదన్నారు. భవిష్యత్‌లో మళ్లీ రోడ్డును ఆక్రమించి పార్కింగ్‌లకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.